# ప్రజలకు సకాలంలో వైద్య సేవలు

## మాతా, శిశు మరణాలు తగ్గింపుకు చర్యలు - వైద్యాధికారులతో కలెక్టర్ హరినారాయణన్



చిత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: వైద్యాధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వీడి రోగులకు సకాలంలో సత్వరం వైద్య సేవలు అందించడానికి పూనుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ హరినారాయణన్ 2022 ఏప్రిల్ నుండి 2023 జనవరి వరకు జరిగిన ప్రసూతి మరణాలకు సంబంధించి సంబంధిత మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాల శాతం తగ్గించడానికి చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణీలు, శిశువుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి ఇతర ఆసుపత్రులకు తరలించాల్సి వస్తే కాలయాపన జరుగకుండా తక్షణం ఆధునాతన వైద్య సేవలు అందించే ఆసుపత్రికి తరలించాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు అవసరమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి వైద్య రంగంలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆసుపత్రుల్లో మౌళిక సదుపాయాల కల్పన, డాక్టర్లు, సిబ్బంది నియామకం తదితరాలను చేపడుతోందన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్ జి.ప్రకాశం, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్, డిఐఓ డాక్టర్ రవిరాజు, సంబంధిత మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు




## నారాయణ కళాశాల హాస్టల్‌లో
# విద్యార్థి ఆత్మహత్య
### షాక్‌కు గురై గుండెపోటుతో హాస్టల్ వార్డెన్ మృతి



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి ధరణేశ్వర్‌రెడ్డి, విచారిస్తున్న పోలీసులు

·గూడూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
గూడూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సీఈసీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా, సంఘటన తెలుసుకున్న హాస్టల్ వార్డెన్ గుండెపోటుకు గురై మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా పులివెందులకు చెందిన ధరణేశ్వర్‌రెడ్డి గూడూరులోని నారాయణ కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ విద్యార్థి నారాయణ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే ధరణేశ్వర్‌రెడ్డి హాస్టల్‌లోని గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య విషయాన్ని సహచర విద్యార్థులు హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులునాయుడుకు సమాచారం తెలిపారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న హాస్టల్ వార్డెన్ షాక్‌కు గురై గుండెపోటుకు గురయ్యారు. ఈయన అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. వీరి మృతదేహాలను గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గూడూరు వన్‌టౌన్ ఎస్ఐ పవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బుల్లెట్ లేని గన్ 'జగన్'

### తల్లిని, చెల్లిని మోసం చేసిన వ్యక్తి మనకు న్యాయం చేస్తాడా
### మద్యం తయారి నుండి బ్లాక్ మార్కెట్ వరకు వైకాపానే
### టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ధ్వజం



కొండ్రాజుకాల్వ గ్రామం వద్ద మహిళతతో మాట్లాడుతున్న నారీ లోకేష్

తవణంపల్లె, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:
మహిళలపై దాడి జరిగితే గన్ కన్నా ముందు జగన్ వస్తాడని చెప్పిన సీఎం జగన్ రాష్ట్రంలో మహిళలపై అతి కిరాతంగా దాడులు జరుగుతున్నా తాడేపల్లె కొంపనుండి బయటకు వచ్చాడా? అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశ్నించారు. యువగళం 9వ రోజు పాదయాత్రలో భాగంగా కొండ్రాజుకాల్వ గ్రామం వద్ద మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలోని మహిళలను అడుగడుగునా మోసం చేశారని అన్నారు. రాష్ట్రంలోని మహిళలపై అతికిరాతంగా దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. బుల్లెట్ లేని గన్ జగన్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో దిశ చట్టం ఎక్కడా అమలుకావడం లేదని, రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ హయాంలో 900 మంది మహిళలపై దాడులు జరిగితే ఇప్పటి వరకు దిశ చట్టం కింద ఒక్కరికి కూడా శిక్ష పడలేదని లోకేష్ తెలిపారు. అలాగే సొంత చెల్లిని, తల్లిని మోసం చేసిన వ్యక్తి జగన్ అటువంటి వ్యక్తి మనకు ఏమి న్యాయం చేస్తాడని అన్నారు. సొంత బాబాయ్ హ్యతకు గురైతే తన సోదరి సునీతకు న్యాయం చేయని వ్యక్తి జగన్ అని తెలిపారు. అలాగే 45 ఏళ్ళు పైబడిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు పించన్లు ఇస్తామని, ఇంత వరకు ఒక్క పించన్‌కూడా ఇవ్వలేదని తెలిపారు. అలాగే పించన్ల పంపిణీలో కూడా అనేక మెలికలు పెడుతూ ఇప్పటికే ఆరు లక్షలు పించన్లను రాష్ట్రంలో తొలగించారని నారా లోకేష్ తెలిపారు. అలాగే ఎన్నికల సందర్భంగా సంపూర్ణ మద్యపాన నిషేదం అమలు చేసామని జగన్ హామీ ఇచ్చారని, అయితే రాష్ట్రంలో మద్యం తయారీ నుండి బ్లాక్ మార్కెట్ వరకు వైకాపా నాయకులే చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ఐటీ మంత్రిగా వున్నపుడు రాష్ట్రంలో 4 వేల పరిశ్రమలు ఏర్పాటు చేసి 60 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించగా జగన్ ప్రభుత్వం వున్న పరిశ్రమలను రాష్ట్రం నుండి తరిమేస్తున్నారని విమర్శించారు. అలాగే ప్రజలపై పలు రకాల పన్నులను విధిస్తుండడంతో నిత్యావసరుకులు ఆకాశనంటుతున్నాయని అన్నారు. చివరకు పీల్చే గాలికి కూడా పన్ను వేస్తారేమోనని ఎద్దేవాచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పన్నులను తగ్గించి ధరలను అదుపుచేస్తామని తెలిపారు. అలాగే తాను చేపట్టిన పాదయాత్రకు అధికారులు అడుగడుగునా అడ్డు తగులుతూ పోలీసు కేసులు పెడుతున్నారని తెలిపారు. అయినా తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి తీసుకెళ్ళాలని నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈపాదయాత్రలో మాజీ మంత్రులు అమర్నాదరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, ఎమెల్సీలు దీపక్‌రెడ్డి, దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిలీప్‌నాయుడు, మల్లారపల్లె గిరినాయుడు, మధుకుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీలు కోదండయ్య, వెంకటేశ్వర చౌదరి, ఎం.లత, మాజీ ఎంపీపీ సరళకుమారి, నాయకులు సునీల్ చౌదరి, శరవణ, చిట్టెమ్మ, జయపాల్, పూతలపట్టు ముత్తు, కుమార్‌నాయుడు, వేణుగోపాల్‌నాయుడు, అమరేంద్రనాయుడు, భాస్కర్‌నాయుడు, గిరిబాబు, వినాయకం, పత్రపల్లె రవి, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రారండి

### ప్రముఖులకు ఆహ్వానాలు



ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డిలకు ఆహ్వాన పత్రికలు అందిస్తున్న చైర్మెన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లాలోని నాయకులకు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు కలసి ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డికి ఆహ్వాన పత్రికలు అందించారు. 13నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

### భక్తుల సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వండి: పెద్దిరెడ్డి

శనివారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక అందించినపుడు ఆయన స్పందిస్తూ పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడుస్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో మహాశివరాత్రికి లక్షలాది మంది భక్తి శ్రద్దలతో కదలి వస్తారు. కాబట్టి ఈ ఏడాది ధర్మకర్తల మండలి కూడా ఉంది కాబట్టి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌళిక సదుపాయాలతో పాటు సుదర్శనం, సత్వర దర్శనం ఏర్పాటుచేయాలన్నారు. విమర్శలు,ఆరోపణలకు అతీతంగా ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని పండగను నిర్వహించాలని సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మంత్రులకు శివయ్య ప్రసాదాలతో పాటు శివరాత్రి ఆహ్వాన పత్రికలను అందించారు. వారితోపాటు ఎఇఓ సతీష్‌మాలిక్, భోర్డు సభ్యులు మున్నారాయల్, జయశ్యాం, మల్లికార్జున్‌రెడ్డి, దేవస్థానంకు చెందిన రాజశేఖర్, వెంకటస్వామి, పార్టీ సభ్యులు నరసింహారాజు(నంద) భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### స్విమ్స్ ఆధ్వర్యంలో
# ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం



ర్యాలీని ప్రారంభిస్తున్న తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు

తిరుపతినగరం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో భాగంగా స్విమ్స్ ఆధ్వర్యంలో శనివారం మహతి ఆడిటోరియంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, చిత్తూరు జిల్లా కలెక్టర్ కె.హరినారాయణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కేర్ ట్రాకర్ యాప్‌ను తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు వెంకటరమణారెడ్డి, కె.హరినారాయణ, తితిదే జెఇఓ సదాభార్గవి, ఎస్వి వేదిక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొపెసర్ రాణి సదాశివమూర్తి, స్విమ్స్ డైరెక్టర్ మరియు వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.వెంగమ్మ, బయె ప్రత్యేకాధికారిగా డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి, తిరుపతి డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, కేర్ ట్రాకర్ యాప్ సిఈవో సాయిక్రిష్ణ అననంరాజు, కాశీరాంరెడ్డి కో పౌండర్లు ప్రారంభించారు. ఈయాప్‌ను భారతదేశంలోనే తొలిసారిగా ఏపిలో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ స్విమ్స్‌లో తొలిసారిగా ప్రారంభించారన్నారు. దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం రోగులను ముందుగానే స్విమ్స్ నందు మెడికల్, సర్జికల్, అంకాలజీ విభాగాల ద్వారా వైద్యసేవలు పొందిన తర్వాత వైద్యులను సంప్రదించి మందులు ఎలావాడాలి, ఏజాగ్రత్తలు తీసుకోవాలో ఇంటి వద్ద నుంచే యాప్ ద్వారా వైద్యుల సలహాలు సూచనలు పొందవచ్చన్నారు. అనంతరం పాలియేటివ్ కేర్‌వింగ్(వార్డు)ను ప్రారంభించారు.

# 10న షార్ నుంచి ఎస్ఎస్ఎల్వి డి2 రాకెట్ ప్రయోగం



శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌ను విజయవంతం చేయడానికి మరో రాకెట్‌ను సిద్ధం చేసింది. ఎస్ఎస్ఎల్వి డి-2 పేరుతో నిర్మితమైన ఈ రాకెట్ శ్రీహరికోట నుంచి ఈ నెల 10న నింగికి ఎగరనుంది. చిన్న తరహా ఉపగ్రహాలను అంతరిక్షంలోని తక్కువ కక్ష్యకు చేర్చి ఎక్కువ ప్రయోజనాలు ఆర్జించడానికి ఇస్రో ఎస్ఎస్ఎల్వి సిరీస్‌ను సిద్ధం చేసింది. అయితే గత ఏడాది ఆగస్టు 7న షార్ నుంచి జరిగిన తొలి ఎస్ఎస్ఎల్వి ప్రయోగం విఫలమైంది. అప్పటి నుంచి శాస్త్రవేత్తలు ఈ తరహా మరో రాకెట్‌ను సిద్ధం చేశారు. ఎస్ఎస్ఎల్వి డి1 వైఫల్యాన్ని అధిగమించి మళ్లీ విజయ తీరాలకు చేరాలన్న లక్ష్యంతో ఎస్ఎస్ఎల్వి డి2ను ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా భారతీయ భూపరిశీలన ఉపగ్రహం ఇఓఎస్ 07తో పాటు మరో రెండు మైక్రోశాట్ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చనున్నారు. ఆగస్టు 10 ఉదయం 9 గంటల 18 నిమిషాలకు జరగనున్న ఈ ప్రయోగ వీక్షణకు అప్పుడే విజిటర్స్ గ్యాలరీని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే విజిటర్స్ నమోదుకు ఇస్రో తమ వైబ్‌సైట్‌ను సిద్ధం చేసింది.

# 5,6తేదీల్లో యువ ధార్మికోత్సవం

### -18న క్షేత్రపాలకుడికి అభిషేకం



తిరుమల, ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:
యువతకు సనాతన హిందూ ధర్మంపై, ధార్మిక అంశాలపై మరింత అవగాహన కల్పించేందుకు, పుణ్యక్షేత్రం తిరుమలలో ఈనెల5,6 తేదీల్లో రెండురోజులు యువధార్మికోత్సవం నిర్వహిస్తున్నట్లు టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. ఆస్థానమండపంలో జరిగే ఈ శిక్షణలో దాదాపు 2వేలమంది యువకులు పాల్గొంటున్నారన్నారు. హిందూ సనాతన ధర్మంపై యువతకు సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 18వ తేదీ శనివారం తిరుమలలో క్షేత్రపాలకుడు రుద్రుడికి విశేష అభిషేకాదులు జరుగుతాయన్నారు. ఎస్వీబిసిలో సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు ప్రసారమవుతున్న గరుడపురాణం భక్తుల మన్ననలు పొందుతోందన్నారు. తిరుమలలో నూతన పరకామణి భవనంలో ఆదివారం(నేటి) నుంచి కానుకల లెక్కింపు ప్రారంభిస్తున్నామన్నారు. శ్రీవారి ఆనందనిలయం బంగారుతాపడం ఆరునెలలు వాయిదా వేయడం జరిగిందన్నారు. భక్తులకు మరింత మెరుగైన డిజిటల్ సేవలందించేందుకు ప్రయోగాత్మకంగా టిటిదేవస్థానమ్స్ పేరుతో మొబైల్‌యాప్‌ను ఇటీవల ప్రారంభించామన్నారు. భక్తులకు అందుబాటులో యోగదర్శనం శ్లోకాలను త్వరలో యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచుతామని ఇఓ ధర్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టిటిడిజెఇఓ సదాభార్గవి, ఎస్వీబిసి సిఇఓ షణ్ముఖకుమార్, డిప్యూటీ ఇఓలు భాస్కర్, శెల్వం, హెచ్‌డిపిపి ప్రత్యేకకార్యదర్శి విభీషణశర్మ, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఏపిఆర్ఓ నీలిమ, విజిఓ గిరిధర్, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో కుటుంబ సలహా కేంద్రం పున:ప్రారంభం

### అనంతపురం రేంజ్ డిఐజి ఎం. రవిప్రకాష్

తిరుపతి క్రైం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త
తిరుపతి నగరంలో కుటుంబ సలహా కేంద్రం పున: ప్రారంభం చేసామని ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా భార్యాభర్తల సమస్యలను పరిష్కరించడమే కుటుంబ సలహా కేంద్రం ముఖ్య ఉద్దేశ్యమని అనంతపురం రేంజ్ డిఐజి ఎం. రవి ప్రకాష్ పేర్కొన్నారు. శని వారం తిరుపతి నగరంలోని బాలాజీ కాలనీ పోలీస్ క్వార్టర్స్ భవనంలో కుటుంబ సలహా కేంద్రంను అనంతపురం రేంజ్ డిఐజి ఎం. రవి ప్రకాష్, తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి పూజలు చేసి కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ మన భారతీయ సాంప్రదాయం ప్రకారం మన దేశంలో కుటుంబ వ్యవస్థ చాలా గొప్పది, ఆ గొప్పతనాన్ని గురించి



ఇరువురి కుటుంబ సభ్యులకు వివరిస్తూ వారిని తిరిగి నిజ జీవితంలో కలిపే సిద్ధాంతం ఆధారంగా ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కుటుంబంలో భార్య భర్తల మధ్య చిన్న చిన్న గొడవలతో ప్రారంభమై అది మన: స్పర్ధలతో విడాకుల వరకు వెళ్ళుతున్నాయి. ఇరుపక్షాల కుటుంబ సభ్యులను ముందుగానే సమావేశపరచి రాజీ చేయుటకు తిరుపతి జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి ముందుకు వచ్చి నిపుణులైన సభ్యులతో కూడిన ఒక కమిటిని ఏర్పాటు చేసి వారి ద్వారా సదరు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇప్పించి వారిని తిరిగి కలిపే సంతోషంగా జీవించే విధంగా ప్రయత్నం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కమిటీలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు శాశ్వత అధ్యాపకులు, రాస్ ఎన్జీవో, లాయర్ సేవాదళ్ అనే లోక్ అధాలత్ నుంచి సభ్యులు, వైద్యులు, మానసిక వైద్యులు, అడ్వకేట్లు నిపుణులైన సభ్యులుగా ఉంటారు.

## తిరుమల తరహా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

### అధికారుల సమన్వయంతో బ్రహ్మోత్సవాల నిర్వహణ
### ఫిబ్రవరి 11 నుండి బ్రహ్మోత్స వాహన సేవలు: జెఈఓ వీరబ్రహ్మం



చంద్రగిరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:
తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు టిటిడి జెఈఓ వీరబ్రహ్మం తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ధీపాలంకరణ, ఆర్చిల నిర్మాణం, ఫ్లెక్సీల ఏర్పాటు, భక్తులకు అవసరమైన అన్నప్రసాదాలు, తిరుమల లడ్డూ ప్రసాదాలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, కళ్యాణ కట్టలో అధనపు సిబ్బంది, ట్రాఫిక్ నియంత్రణ, పటిష్ట భద్రతపై చర్చించారు. గరుడవాహన సేవ, రథోత్సవం, చక్రస్నానం రోజుల్లో అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఎస్వీబిసి ద్వారా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల ప్రాశస్థం వివరిస్తూ ప్రసారం చేయాలన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండ్, టిటిడి సత్రాలు, శ్రీనివాసం, విష్ణు నివాసం వంటి భక్తుల రద్దీ కలిగిన ప్రదేశాలలో కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ రవి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సిఐ ఓబులేష్, ఇంజినీరింగ్, రెవెన్యూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పట్టాలు తప్పిన గూడ్స్ రైలు
# సాంకేతిక లోపమా...? మానవ తప్పిదమా...?



రేణిగుంట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: రేణిగుంట రైల్వేస్టేషన్‌సమీపంలోని సౌత్ క్యాబిన్ వద్ద గూడ్స్ రైలు (న్యూ మోటారు గూడ్స్) పట్టాలు తప్పిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా...? లేక మానవ తప్పిదం వల్ల ప్రమాదం సంభవించిందా అని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు మాత్రం ఇలాంటి ప్రమాదాలు సహజంగా జరుగుతాయన్నారు. వివరాలు ఇలా... తమిళనాడు రాష్ట్రం వడ్డిపట్టి నుంచి బీహార్ రాష్ట్రం బాగలకికోటకు ట్రాక్టర్ల లోడుతో గూడ్స్ రైలు బయలుదేరింది. ఈ రైలు రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో సౌత్ క్యాబిన్ వద్ద మెయిన్ ట్రాక్ నుంచి లుప్ ట్రాక్‌పైకి పట్టాలు మారుతుండగా ఇంజన్ ఎనక వైపు ఉన్న మూడో భోగి, నాలుగో భోగి పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులంతా అక్కడ చేరుకుని ఇంజన్‌తో సహా మొదటి రెండు భోగిలను పట్టాలు తప్పిన భోగిల నుంచి వేరు చేసి ముందుకు తీసుకెళ్లారు. పట్టాల తప్పిన భోగిల వెనుక ఉన్న భోగిలను వేరు చేసి వాటిని వెనక్కి తీసుకెళ్లారు. సాంకేతిక సిబ్బంది పట్టాలు తప్పిన భోగిలను ట్రాక్‌పైకి ఎక్కించే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. జరిగిన ప్రమాదంపై స్టేషన్ డైరెక్టర్, లైజనింగ్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదం వల్ల రైళ్ళ రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఏర్పడలేదన్నారు. ప్రాణం నష్టం జరగలేదన్నారు. ప్రమాదం ఎలా జరిగిందో ఉన్నతాధికారులు విచారణ జరిపి నిర్ధారిస్తారన్నారు. సహాయక చర్యల్లో స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, ఏడీఈఎన్ విల్సన్, జీఆర్పీ డీఎస్పీ షాను, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ రాజు, ఆర్పీఎఫ్ సీఐ సందీప్, ఆర్పీఎఫ్ ఎస్ఐలు సుధాకర్, రమేష్, జీఆర్పీసీఐ దేవేంద్రకుమార్, జీఆర్పీఎస్ఐ అనిల్, శాఖలఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒక్క ఛాన్స్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి..విజయకుమార్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన అరాచక, అవినీతి వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌లు ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనలతో శనివారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 26వ వార్డు ఇన్‌ఛార్జిలు అద్దంకికిట్టు, మురాజ్, కాలేషా,భాస్కర్, సుబ్రమణ్యం, యశ్వంత్, మొబీన్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. ఈసందర్భంగా విజయకుమార్ వార్డులోని ప్రతి ఇంటికి వెళ్ళి వారికి పలకరిస్తూ గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, కరెంటు బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు బాదుడు వంటివి వివరించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, తిరుపతి పార్లమెంటు రైతు నాయకుడు ప్రకాష్‌నాయుడు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, ప్రసాద్‌నాయుడు, సుమతమ్మ, గోపినాథ్, కాసరం రమేష్, వినయ్, మునికృష్ణ, ప్రతాప్, దిలీప్‌కుమార్, మురళీ, దొరబాబు, బషీర్, ఎంఎస్‌రెడ్డి, గోపినాయుడు, భాస్కర్‌గౌడ్, పురుషోత్తమనాయుడు, తిరుకాలహరి, మణి, వెంకటరమణ, యాదగిరి, సుధాకర్, రవీందర్‌నాయుడు, కృష్ణమనాయుడు, మునికృష్ణ, ఆర్ముగం, శివ, హేమంత్, నారాయణగుప్తా,సురేష్‌నాయుడు,సునిమా,హేమంత్‌తెలుగుదేశంపార్టీకార్యకర్తలునాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరిశోధనలపై అవగాహన కలిగి ఉండాలి

తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



విద్యార్థులకు పరిశోధకులపై అవగాహన కలిగి ఉండాలని ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో సైన్సు పరిశోధనలపై తొట్టంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిధిగా హజరైన ఐసర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ నుంచి హజరైన రీసోర్స్ పర్సన్ డాక్టర్ హర్షిణి చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సైన్సు ప్రయోగాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తక్కువ ఖర్చుతో కూడిన పరికరంలో ఉపయోగించి వినూత్న ప్రయోగాలు విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేటట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల సైన్సు టీచర్లు ఆర్థర్‌సుగుణమ్మ, రమణయ్య, సిద్దయ్య, వేణుగోపాల్, పద్మనాధం, వెంకటేష్, ఆశాలత, ప్రజాప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్లు సుబ్రమణ్యం, సుస్మిత, దేవేంద్ర సిబ్బంది రాజారావు, ఓంకార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-చెర్లోపల్లిలో గడప గడప కార్యక్రమంలో ఎంపిపి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి04 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ప్రతి ఇంటికి లక్ష రుపాయాల నుండి ఐదు లక్షల రుపాయాల వరకు సంక్షేమ నిధిని అందజేస్తుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శనివారం చెర్లోపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించారు. గడప గడపకు- మన ప్రభుత్వ కార్యక్రమానికి చెర్లోపల్లికి విచ్చేసిన ఎంపిపి మోహిత్‌రెడ్డికి గ్రామ సర్పంచ్ సుభాషిని ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతి ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాలు గురించి వివరించడమే కాకుండా ప్రతి గడపకు చేకూరిన లబ్దిని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఎంపిటిసి హరిత, వైకాపా నాయకులు వాసుదేవ నాయుడు, శుభగిరి, గుత్తా కోటేశ్వరనాయుడు, పవన్, ప్రసాద్, శంకర్, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బలిజ భవన్‌ను పరిరక్షించండి!

-కలెక్టర్‌కు బలిజ జేఏసి,కాపు సంక్షేమ యువసేన వినతి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



స్థానిక నరసింహతీర్థం రోడ్డులోని బలిజ భవన్‌ను పరిరక్షించాల్సిందిగా తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డికి బలిజ జేఏసి అధ్యక్షుడు నీలం బాలాజి,కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌లు విజ్ఞప్తి చేశారు.శనివారం ఈ మేరకు వారు కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్ నందు కాపు సంఘ నాయకులతో కలిసి వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేటాయించిన బలిజభవన్ కొంతమేర నిర్మాణం జరిగి తరువాత నిధుల లేమితో ఆగిపోవడం జరిగిందన్నారు.ప్రస్తుతం కొందరు ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥కరుణానిధి,బలిజ నాయకులు ఆళ్వార్ మురళి,బెల్లంకొండ సురేష్,రాజు రాయల్,మోహన్,హేమంత్,విజయలక్ష్మి,యమున,రఘు,రామారావు,చంద్రశేఖర్,పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దాం

నగరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దాం అని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ముని సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక ఎస్‌జీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్టు వ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆనం కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి చిహ్నాలు, చికిత్స గురించి తెలియజేశారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నమఃశివాయం, మెడికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు హుసేనమ్మ, ఏఎన్ఎం ప్రమీల, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఒలింపియాడ్‌లో విజేత విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



ఒలింపియాడ్‌లో విజేత విద్యార్థులు నాసో ఒలింపియాడ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో విజేత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని యం.కృత్తిక రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం, మరియు పి.హెనితేజ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుని బంగారు పతకాలు మరియు మెరిట్ సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈసందర్భంగా వీరిని పాఠశాల డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపల్ రామ్, ఉమాసింగ్ విద్యార్థులను అభినందించారు.

## గణనాధుని సేవలో ఏపీ, తెలంగాణా హైకోర్టు జడ్జిలు





కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ఏపీ, తెలంగాణా రాష్ట్రాల హైకోర్టు జడ్జిలు శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఈమేరకు ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, తెలంగాణా హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ అనుపమా చక్రవర్తిలు కుటుంబ సమేతంగా కాణిపాకం స్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడు, ప్రోటో కాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గృహసారథులు, సచివాలయ కన్వీనర్లది కీలక పాత్ర

గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త



గృహసారథులు, సచివాలయ కన్వీనర్లది కీలక పాత్ర అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమీపంలో గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల శిక్షణలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి గృహ సారధి తన పరిధిలోని 25 కుటుంబాలలో అర్హులై ప్రభుత్వ పథకాలు అందనివారు ఎవరైనా ఉన్నారా అని గుర్తించాలన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని గృహ సారధులకు, సచివాలయ కన్వీనర్లకు, వాలంటీర్లకు జగనన్న పార్టీ, ప్రభుత్వం కల్పించిందన్నారు.

**సచివాలయ మండల కన్వీనర్‌గా తొప్పయ్య..** సచివాలయ మండల కన్వీనర్‌గా మండలంలోని నీరువాయికి చెందిన జి. తొప్పయ్యను నియమించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రకటించారు. సభలో ఆయనకు పరిచయం చేసారు. కొత్తగా నియామకమైన మండల సచివాలయ కన్వీనర్ తొప్పయ్యను జడ్పి ఫైనాన్స్ కమిటి సభ్యులు కోనేటి సుమన్ కుమార్ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపిపి హెచ్ రేఖ, సర్పంచ్‌లు కేజీ రోస్ రోడ్డి, సతీష్, అన్నాదొరై, ఏఎంసి మాజీ డైరెక్టర్ పాలపద్మనాభం, ఎంపిటిసి సభ్యులు రమేష్ రాజు, శోభన్, వేలు నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన అవసరం

తిరుపతి (విద్య), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రంలోని రీసెర్చ్ అసోసియేషన్ డాక్టర్ ఈ కోన ప్రభ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గొల్లపల్లి గ్రామంలోని వైఎస్ఆర్ భవనంలో మహిళలకు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోన ప్రభ మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళలు క్యాన్సర్ వ్యాధిపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవడం చాలా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది డాక్టర్ ఎం. సుచరిత, డా. ఎం. ఇంద్రాణి, తిరుపాల్ రెడ్డి, కమ్యూనిటటీ కోఆర్డినేటర్, మహిళలు పాల్గొన్నారు.

## పాఠశాలకని బయలు దేరి . . .

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు గ్రామానికి చెందిన గౌతమ్ శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం గౌతమ్ ఇంటి నుంచి పాఠశాల పుస్తకాలతో పాటు రెండు జతల బట్టలు తీసుకొని బయలుదేరాడు. అయితే తల్లితో తనకు చదువుకోవటం ఇష్టం లేదని చెప్పి బయలు దేరాడు.అయితే గౌతమ్ గతంలో కూడా ఇలాగే ఇంటి నుంచి బయటకు వచ్చేసేవాడు. అలా అని తల్లి వస్తాడులే అని మౌనం వహించారు.అయితే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌతమ్ ఇంటికి ఫోన్ చేసి పాఠశాలకు రాలేదని చెప్పటంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసారు.కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## నేను పోటీ చేస్తున్నాను! నాకు సహకరించండి!

గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్న బొల్లినేని

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధం నాయుడు రాబోవు సాధారణ ఎన్నికల్లో ఇండిపెండెంట్ సభ్యుడుగా పోటీ చేస్తున్నానని తనకు సహకరించాలంటూ ఊరూ వాడ ప్రచారం చేస్తున్నారు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అలాగే రాజకీయ నాయకులను కలుసుకుంటూ తనకు సహకరించాలని కోరుతున్నారు. శనివారం ఏర్పేడు మండలంలోని బండారుపల్లి అరుంధతి వాడలో సమావేశం ఏర్పాటు చేసి తన గెలుపుకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు మండలనాయకులుఈభాస్కర్‌నాయుడు,కెకెరమణ,బత్తేయ్యయాదవ్,మునిరామయ్య పాల్గొన్నారు.

## గాయపడ్డ మహిళ మృతి

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం రామాపురం సమీపంలో గత నెల 30 జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సమాచారం అందిందని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి.సత్యవేడు నియోజకవర్గం నింద్రకు చెందిన శేఖర్, వసంతమ్మ(40) తమ ద్విచక్రవాహనంపై వివాహ్ ఆహ్వాన పత్రికలను బంధువులు చిన్నమిట్ట కండ్రిగకు వస్తున్నారు. రామాపురం గ్రామం సమీపంలో రిజర్వాయర్ వద్ద ఎదురుగా కెవిబిపురం మండలం బైరాజ్‌కండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం వాహనం డీకొంది.అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వసంతమ్మను తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సమాచారం అందిందని ఎస్ఐ వెంకటేష్ వివరించారు.

## కారాకొల్లు పంచాయతీలో ఇదేం ఖర్మ కార్యక్రమం..

తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



మండలంలోని కారాకొల్లు పంచాయతీలో గ్రామంలో తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిబొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కారాకొల్లు పంచాయతీలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును, నియోజకవర్గ ఎంఎల్ఏగా బొజ్జలసుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణమనాయుడు, శ్రీధర్‌నాయుడు, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎల్లయ్య, వెంకటరమణయ్య, శంకరయ్య, మునెయ్య నాయుడు, సుబ్బరత్నమ్మ, చెంచురామయ్య, వనజమ్మ, గీత, రాజేశ్వరి, మల్లీశ్వరి, పద్మమ్మ, జనార్ధన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పంటనమోదును పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

మండలంలోని తాటిపర్తి, గురుకులపాళెం, మరియు పెన్నలపాడు గ్రామాల్లో జిల్లా వ్యవసాయాదికారి ఎస్. ప్రసాదరావు పంటలను మండల వ్యవసాయాదికారి సురేంద్రరెడ్డితో కలసి పర్యటించారు. ఈసందర్భంగా రబీ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి పంటసాగుచేసిన ప్రతిరైతును ఈ-క్రాప్ నమోదు మరియు ఈకెవైసిని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ సహాయ సంచాలకులు ధనంజయరెడ్డి, డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జె.సుబ్రమణ్యం,మండల వ్యవసాయాధికారి ఎన్.సురేంద్రరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు చౌడేశ్వరి, చంద్రమ్మ, సుధాకర్, కవిత మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై ఉచిత అవగాహన శిబిరం

తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా స్టెప్స్ సంస్థ శ్రీకాళహస్తి పథక సంచాలకులు డాక్టర్ ప్రమీలమ్మ ఆధ్వర్యంలో చెంచులక్ష్మి కాలనీలోని ప్రజలకు ఉచిత కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం మరియు పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలకు వచ్చే రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి, గొంతు, ఇతర క్యాన్సర్ యొక్క లక్షణాలు, తీసుకొచ్చిన జాగ్రత్తలు గురించి సవివరంగా తెలిపారు. గుట్కాలు, ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, రమేష్, గాయత్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.8.80లక్షలతో అమృత సరోవర్ పనులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



మండలంలోని చిట్టత్తూరు పంచాయతీలో రూ.8.80లక్షలతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న అమృత సరోవర్ పనులను డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా పనులు ఎలా జరుగుతున్నాయి, ఎంతమంది కూలీలు పనిచేస్తున్నారు, మస్టర్‌లో సంతకాలు తీసుకున్నారా?లేదా? కూలీ ఎంత వస్తోందోని ఉపాధిహామీ కూలీలతో అడిగి తెలుసుకున్నారు. కూలీలకుతగిన సౌకర్యాలు కల్పించాలని ఎపిఓ సుజాతను ఆదేశించారు. ఆయనతో పాటు ఎపిడి ప్రేమ్‌కుమార్ మరియు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## వందకిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా తెదేపా సంబరాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



నారాలోకేష్ యువగళం పాదయాత్ర 100 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా వినాయకుడి ఆలయంలో తెలుగుమహిళ తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష ఆధ్వర్యంలో విఘ్నాలను తొలగించే వినాయకుని ఆలయంలో 100కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్, మాజీ ఎంఎల్ఏ హేమలత, సత్యవేడు ఇన్‌ఛార్జి హెలిన్, నాయకులు మండల అధ్యక్షులు భాస్కరన్, నాయకులు సతీష్‌నాయుడు, గిరి, నరేంద్ర, సంతోష్, సదాశివయ్య, వేణు, సుబ్బయ్య, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఉపాధి పనులు కల్పించడంలో రాజీపడవద్దు

డ్వామా పిడి గంగాభవాని

నింద్ర, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో ఎక్కడ రాజీపడవద్దని డ్వామా పిడి గంగాభవాని తెలిపారు.శనివారం మండల కేంద్రంలో సియల్‌ఆర్‌సి భవనంలో ఆరు మండలాల ఎపిఓలు,జెఇలు,సాంకేతిక,క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం జరిగింది.ఈసమావేశంలో డ్వామా పిడి మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభం నేపథ్యంలో ఉపాధి హామి పనులు గణనీయంగా చేపట్టి ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు.దీనికి సంబందించి నిర్దేశించిన కూలీలు పనులు కల్పించిలక్ష్యలను చేరుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఓలు,జెఇలు,సాంకేతిక,క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఏ పౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం

తిరుపతి (విద్య), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త

ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ వారు ఈ నెల 3వ తేది విడుదల చేసిన సిఏ పౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని సంస్థ డైరెక్టర్లు ఇ. గిరిధర్ రెడ్డి, కె. విశ్వనాథ్ రెడ్డిలు తెలిపారు. ఈ ఫలితాల్లో డి. దామోదర్ 292, యు. జైనమ్‌జైన్ 288, ఎం. కార్తీక్ రెడ్డి 274 మార్కులు సాధించి టాపర్లుగా నిలవడంతో పాటు మొత్తంగా 60.43 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు.

## మల్టిడిసిప్లినరీ అకడమిక్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్‌పై కాన్ఫరెన్స్

తిరుపతి (విద్య), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త



మల్టిడిసిప్లినరీ అకడమిక్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ పై రెండు రోజుల నేషనల్ కాన్ఫరెన్స్‌ని అప్లైడ్ మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి ఎస్‌పిఎం వివి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజిని హాజరయ్యారు. ముఖ్య అతిధిగా హాజరైన సందర్భంగా ప్రసంగిస్తూ నేటికి అవసరమయ్యే మల్టీ డిసిప్లినరీ రంగాల్లో పని చేసేలా ప్రోత్సహించారు. తిరుపతిలోని ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎం. రవిశంకర్ తిరుపతిలో పరిశోధనలు ప్రాథమిక అవసరమని ఏ రంగంలోనైనా చిత్తశుద్ధితో పనిచేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమ అధ్యక్షురాలు ప్రొ. టి. సుధ, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ఐఅండ్‌సి మల్టీడిసిప్లినరీ రీసెర్చ్ యొక్క ప్రాముఖ్యతను, సమాజం పై దాని ప్రభావాన్ని ఎత్తి చూపారు. ఎన్‌సిఎంఏఆర్ఐ 2023 డైరెక్టర్ డాక్టర్ సి. వెంకటలక్ష్మి, డిపార్ట్‌మెంట్, దాని పరిశోధన కార్యకలాపాల గురించి చర్చించారు. సదస్సు కన్వీనర్ డా. ఎం. శివపార్వతి పాల్గొనే వారికి సదస్సు థీమ్‌ను అందించారు.

## లోక కల్యాణార్ధం శనైశ్చర ఆలయంలో శాంతి పూజలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీ శనైశ్చరస్వామి వారి ఆలయంలో శనివారం శాంతి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి, నవగ్రహాలకు తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో గోపూజ చేశారు. పండితుల వేద మంత్రోఛ్ఛారణల నడుమ శాంతి హోమం నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రమణ్యశర్మ వివిధపుష్పాలు,ఆభరణాలు,నూతనవస్త్రాలతోస్వామివారినిఅలంకరించిభక్తులకుదర్శన భాగ్యం కల్పించారు.

## సచివాలయ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:

అనుప్పల్లి సచివాలయ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా సిబ్బంది వేతనాల బిల్లులు ఇప్పటి వరకు రాయకపోవడం బాధాకరమన్నారు.ప్రతి నెలా 25వ తేదీనే ఉద్యోగుల వేతనాల బిల్లులను వ్రాసి సంబంధిత శాఖకు పంపాలన్నారు.పంచాయతీకార్యదర్శికక్ష్యసాధింపుచర్యలువిడనాడివెంటనేవేతనాలుచెల్లించాలని డిమాండ్ చేశారు.

## సిఎం జగనన్న మళ్లీ ఆశీర్వదించండి

– సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని అన్ని వర్గాలు, కులాలు, మతాలకు సంక్షేమ పథకాలను వివక్షకు తావులేకుండా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో సచివాలయం కన్వీర్లు, గృహ సారథులకు జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన నవరత్నాల హామీలను తూచ తప్పకుండా అమలు పరచడం జరుగుతుందని గుర్తు చేశారు. ఓటు అడిగే అర్హత చంద్రబాబుకి, పవన్‌కి లేదన్నారు. ఎంతమంది జత కట్టి వచ్చిన జగనన్నను ఏమి చేయలేరన్నారు. కావున సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పార్టీ కోసం కష్ట పడి పనిచేయాలన్నారు. అంతకుముందు జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, మాజీ నెడ్‌క్యాప్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, వైస్ఎంపిపి శివశంకర్, కో ఆప్షన్‌మెంబర్ సోదామణిరెడ్డి, నాయకులు నారాయణస్వామి, సాయిరవి, గుడ్డల గురుస్వామి, కోనేటి సుధాబాబు, కోన ఛైర్మన్ సుబ్రమణ్యంయాదవ్, మాజీ ఛైర్మన్ బత్తల భాస్కర్‌యాదవ్, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఐక్యమత్యంతో సత్యవేడులో టిడిపిని గెలిపించుకుందాం

నరసింహయాదవ్

నారాయణవనం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులందరు ఐక్యమత్యంతో వుండి సత్యవేడు అసెంబ్లీ స్థానాన్ని గెలిపించుకోవడానికి కృషి చేయాలని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఇంఛార్జీ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలతలు కోరారు. శనివారం సాయంత్రం మండలకేంద్రంలోని దూండి వినాయకుని ఆలయంలో నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం మండల టిడిపి కన్వీనర్ ఎన్ భాస్కరన్, మండల ఇంఛార్జీ పి గిరిబాబు వారిద్దరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యవేడులో ఎవరు గెలిస్తే రాష్ట్రంలో అదే పార్టీ వస్తుందన్న నమ్మకం వుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ఇంఛార్జీ డాక్టర్ హెలెన్ హేమలతకు వందశాతం సీటు ఖాయమని, కావున అందరు కలిసి కట్టుగా పని చేసి ఆమె గెలుపుకు కృషి చేద్దామన్నారు. లోకేష్‌బాబు చేపడుతున్న యువకళంకు ప్రజల నుంచి యువకులను నుంచి మంచి స్పందన వస్తున్నట్టు గుర్తు చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సతీష్‌నాయు, రామాంజులునాయుడు, తిరుమలైరెడ్డి, టి.షణ్ముగం, కెఎస్‌రవి, అవసరం సురేష్‌రెడ్డి, మునస్వామియాదవ్, గోపినాథ్‌రెడ్డి, బాబు, బిసి, ఎస్సీ, మైనార్టీ నాయకులందరు పాల్గొన్నారు.

## పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

నారాయణవనం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :

పుత్తూరు సమీపంలోని నారాయణవనం సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించినట్టు ఆ కళాశాల ఛైర్మనర్ డాక్టర్ కె అశోకరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ తమ కళాశాలకు ఇటీవల న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు లభించిందని, అందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి మెడల్, సర్టిఫికేట్‌ని అందించడ ం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎన్‌బీఏ గుర్తింపు కోసం ధరఖాస్తు చేసుకుంటే ఉన్నత అధికారులు కళాశాలను పరిశీలించి గుర్తింపును ఇవ్వడం జరిగిందన్నారు. ఈ గుర్తింపు రావడానికి సహకరించిన అధ్యాపకులకు, విభాగాధిపతులకు, ప్రిన్సిపాల్స్‌కి ప్రత్యేకంగా ధన్యవాధాలు తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంచే విధంగా చదువును నేర్పించాలని కోరారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించాలి – సీపీఐ డిమాండ్

నగరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే 90 ఉద్యోగస్తుల ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించాలని సీపీ ఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గిరిబాబు డిమాండ్ చేశారు. శనివారం నగరి ప్రభుత్వా స్పత్రిలో పని చేసే ఔట్ సోర్సింగ్, నర్సులు విస్తృత స్థాయి సమావేశం ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కోశాధికారి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ కార్యదర్శి గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య రంగంలో ప్రభుత్వ ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించడంలో ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించడం లోను రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. అనంతరం నగరి ఏరియా ఆస్పత్రిలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. యూనియన్ గౌరవాధ్యక్షులుగా రత్నమ్మ, అధ్యక్షులుగా పుష్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీరజ, ఉపాధ్యక్షులుగా మధుబాల, ఆదిలక్ష్మి, సంగీత, ప్రధాన కార్యదర్శి హేమంత్‌కుమార్, సంయుక్త కార్యదర్శి పాండు రంగయ్య, సహాయ కార్యదర్శి ధనలక్ష్మి, ఆముద, సుభాషిణి, కుప్పుస్వామి, కోశాధికారిగా బింధు, నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా రాధా, కోశాధికారి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

# వడ్డెరల గనులు కొట్టేసిన మైనింగ్ మంత్రి పెద్దిరెడ్డి

**-టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్**



తవణంపల్లె, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: టీడీపీ ప్రభుత్వ హయాంలో వడ్డెరలకు కేటాయించిన గనులను రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి కొట్టేసి తన వర్గం వారికి కేటాయించారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర 9వ రోజు ఉదయం మండలంలో శనివారం ప్రారంభమైంది. మండలంలోని ఎ.గొల్లపల్లెకు చేరుకున్న పాదయాత్ర అరగొండ, దిగువమాఘం, కొండ్రాజుకాల్వ, ఎగువ వెంకటాపురం మత్యం క్రాస్, దిగువ తడకర, ముత్యాలమిట్ట, గళ్ళావాళ్ళవూరు, మిట్టపల్లె మీదుగా తవణంపల్లె వరకు సాగింది. ఎ.గొల్లపల్లెలో వడ్డెరల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి సీఎం దివంగత ఎన్టీఆర్ 1980లో వడ్డెరలకు ఆర్థిక స్వాలంబన కల్పించడం కోసం ప్రత్యేకంగా గనులు కేటాయించి చేతివృత్తి చేసుకునేందుకుఅవకాశం కల్పించారని తెలిపారు. అయితే జగన్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన అనంతరం గనుల మంత్రి పెద్దిరెడ్డి అనే వ్యక్తి వడ్డెరలకు కేటాయించిన గనులను కొట్టేసి తన వర్గం వారికి కేటాయించారని ఆరోపించారు. అలాగే నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు వడ్డెరలు ఆర్థికంగా బయటకు రావాలని వడ్డెర పెడరేషన్‌ను ఏర్పాటు చేసి 132 కోట్లు రూపాయలు నిధులు కేటాయించి వడ్డెరలకు రుణాలు అందించినట్లు నారా లోకేష్ తెలిపారు. అయితే జగన్ ప్రభుత్వం వడ్డెరలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసినా ఇంత వరకు ఒక్కరికి కూడా రుణాలు అందించలేదని తెలిపారు. అలాగే ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వడ్డెరలను ఎస్టీల జాబితాలో చేర్చేందుకు సత్యపాల్ కమిటీని వేసి కమిటీ నివేదికను కేంద్రప్రభుత్వంకు నివేదించడం జరిగిందని తెలిపారు. అయితే జగన్ వడ్డెరలను ఎస్టీల జాబితాలో చేర్చుతామని ఇచ్చిన ఎన్నికల హామీని తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. ఎల్లవేళలా వడ్డెరలకు అండగా వుండేది టీడీపీ పార్టీ, టీడీపీ ప్రభుత్వమేనని లోకేష్ తెలిపారు. వడ్డెరలు, బడుగు, బలహీన వర్గాలవారు ఆర్థిక స్వాలంబన వచ్చేంతవరకు టీడీపీ అండగా వుంటుందని తెలిపారు. అలాగే ప్రస్తుత సీఎం జగన్ ధనవం తుల సీఎం అని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నిత్యావర సరుకుల ధరలు ఆకాశనం టుతున్నాయని అన్నారు. ఈమ రపభుత్వం అధికారంలోకి వస్తే ధరల నియంత్రణకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, వడ్డెర సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

**వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి**

రానున్న ఎన్నికల్లో వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి రెండు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని వడ్డెర సంఘం నాయకులు నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో వడ్డెరలు 26వేల ఓటర్లు కలిగి వున్నారని కావున ఎన్నికల్లో రెండు పార్లమెంట్ స్థానాలను కేటాయిం చాలని విజ్ఞప్తి చేశారు. వడ్డెరలను ఎస్టీల జాబితాలో చేరే ందుకు చర్యలు తీసుకోవాలని వడ్డెర సంఘం నాయకులు బండా రామచంద్రయ్య, రవీంద్రరాజు, దేవుళ్ళ మురళి, వెంకటహరిలు విజ్ఞప్తి చేశారు.

**అడుగడుగునా ఘనస్వాగతం**

యువగళం పాదయాత్రకు వచ్చేసిన నారా లోకేష్‌కు మండలంలో అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఎ.గొల్లపల్లె నుండి మండల కేంద్రం తవణంపల్లె వరకు పాదయాత్ర చేసిన లోకేష్‌కు టీడీపీ శ్రేణులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు భారీ గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా మండలంలోని కొండ్రాజుకాల్వ గ్రామస్థులు లోకేష్‌కు 101 గుమ్మడికాయలతో దిష్టితీసి పూల వర్షం కురిపించారు.

## రామకృష్ణతీర్థ ముక్కోటికొచ్చే...భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు

**-నిరంతరాయంగా అన్నప్రసాదం,తాగునీరు-దీర్ఘకాలిక వ్యాధులున్నవారు రావద్దు**





తిరుమల,ఫిబ్రవరి 4 ప్రభాతవార్తప్రతినిధి: మాఘమాస పౌర్ణమి సందర్భంగా ఆదివారం(నేడు)తిరుమలలో రామకృష్ణ తీర్థముక్కోటికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లుచేపట్టినట్లు టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. తీర్థముక్కోటికి వెళ్ళే భక్తుల భద్రతకు చలువబండ పాయింట్ వద్దనుంచి రామకృష్ణ తీర్థం వరకు ప్రతి 15 మీటర్లకు విజిలెన్స్,పోలీసు,అటవీశాఖల సిబ్బంది ఒక్కొక్కరు పర్యవేక్షణ ఉంటుందన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, ఆస్తమా, స్థూలకాయం,రక్తపోటు ఉన్న భక్తులు వృద్ధులు ట్రెక్కింగ్ చేయవద్దని విజ్ఞప్తిచేశారు. పాపవినాశనం, చలువబండ, రామకృష్ణతీర్థ ముక్కోటి ప్రాంతాల్లో వైద్యబృందాలు సిద్ధంగా ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం 5గంటల నుంచి నిరంతరాయంగాభక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు సరఫరా చేస్తామన్నారు. రామకృష్ణతీర్థముక్కోటి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలకొచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. శనివారం టిటిడి విజిలెన్స్, పోలీసు, అటవీ,ఇంజనీరింగ్ విభాగాలతో సమీక్షించారు. భక్తుల రవాణాకుప్రతి 5నిమిషాలకు ఒక ఆర్టీసి బస్సు మొత్తం 30 బస్సులనూ ఆర్టీసి నడుపుతుందన్నారు. పాపవినాశనం పరిసరాలలో పార్కింగ్ లేనందున గోగర్భండ్యామ్ వద్దనుంచే ప్రైవేటు వాహనాలు,ట్యాక్సీలను అనుమించరు. మధ్యాహ్నం 12 గంటల తరువాత పాపవినాశనం నుండి రామకృష్ణతీర్థం ప్రవేశమార్గం మూసివేయబడుతుంది. ఈ సమీక్షలో ఎస్ఇ2 జగదీశ్వర్‌రెడ్డి, రవాణా జిఎం శేషారెడ్డి, డిప్యూటీ ఇఒలు హరీంద్రనాథ్, సెల్వం, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, అదనపు ఎస్పీ మునిరామయ్య, విజిఒ బాలిరెడ్డి,విజిలెన్స్,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**-పార్కింగ్ స్థలాల్లో వాహనాల కిటకిట**



కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. గత కొద్ది రోజు లుగా ఆలయంలో వారంతపు రోజుల్లో అంచ నాలకు మించి భక్తుల రద్దీ వుంటోంది. ఈమేరకు ఆదివారం స్వామివారి దర్శనార్థం భక్తులు అనూహ్యంగా తరలివచ్చారు. ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికా రులు ఏర్పాట్లు చేపట్టారు.

## నిత్యాన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. నిత్యాన్న ప్రసాదం నిర్వహణ చక్కగా ఉండటంతో శనివారం మదనపల్లికి చెందిన ఎం.విజయలక్ష్మి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ పిఆర్ఓ సురేష్‌రెడ్డి ద్వారా దేవస్థానంకు అందజేసారు.రెగ్యూలర్ భక్తులైన విజయలక్ష్మి స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. తాము నిత్యాన్న ప్రసాదానికి విరాళం ఇవ్వాలని కోరారు.దాంతో పిఆర్ఓ సురేష్‌రెడ్డి వారికి వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.పిఆర్ఓ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని సేవలో శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్



కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ అంజూరి తారక శ్రీనివాసులు శనివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్, ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా రజిత



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్, రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెమనాయుడు, మరియు తెలుగుదేశంపార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడిఅనిత ఆదేశాల మేరకు సత్యవేడు నియోజకవర్గంకు చెందిన తెలుగుదేశంపార్టీ తిరుపతి మహిళా కమిటీని నియమించారు. ఈసందర్భంగా సత్యవేడు నియోజకవర్గం కెవిబిపురం మండలం కళత్తూరు పంచాయతీ మాజీ సర్పంచ్ జి.రజిత యాదవ్‌ను తిరుపతి పార్లమెంటు తెలుగుదేశంపార్టీ మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమించారు. ఈసందర్భంగా పలువురు రజితకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ ర్యాలీ




శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో భారీ ర్యాలి నిర్వహించారు. ర్యాలి పానగల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో సాగింది. ర్యాలిని డివైయస్‌పి విశ్వనాథం జెండా ఊపి ప్రారంభించారు. డిబిఆర్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించటం వల్ల పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. ఒకప్పుడు క్యాన్సర్ అంటే మందులు పరిమితంగా ఉండేవని నేడు ఆ భయం లేదన్నారు. క్యాన్సర్ నిపుణులు డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ డిబిఆర్ ఆసుపత్రిలో బ్లడ్ క్యాన్సర్, మరియు బ్రైన్ క్యాన్సర్ వంటి సున్నితమైన క్లిష్టమైన అంశాలకు కూడా మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. ప్రజలకు క్యాన్సర్ అంటే ఇక జీవితం లేదనే భయం ఉందని అవగాహన లేదని వివరించారు. రోగం వచ్చినపుడు ధైర్యంగా వైద్య సదుపాయాలు తీసుకోవాలి తప్ప భయ పడకూడదన్నారు. ప్రజలకు అవగాహన కల్పించుటకే ఈ రోజూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలి నిర్వహించి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డివైయస్‌పి విశ్వనాథం,డాక్టర్ పద్మనాభరెడ్డి,భూదేవి పురప్రముఖులు, విద్యార్థులతో ర్యాలి నిర్వహించారు.ర్యాలికి పోలీసులు ఎస్ఐ తిమ్మయ్య టాఫిక్ ను రియాజ్ వారి సిబ్బంది పర్యవేక్షించారు.

## దేశం నాయకులపై హత్యాయత్నం కేసులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: బంగారుపాళ్యంలో నారా లోకేష్ యువగళం పాదయాత్రలో చోటు చేసుకొన్న సంఘటనలపై బంగారుపాళ్యం పోలీసులు తెలుగుదేశం నాయకులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. బంగారుపాళ్యం టిడిపి అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్, చిత్తూరు జిల్లా దేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పాకాలకు చెందిన దేశం నాయకుడు జగదీష్ మరికొంత మందిపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు.

## అందుబాటులో ఉంటా నన్ను కలవండి : మంత్రి పెద్దిరెడ్డి



రొంపిచెర్ల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : తాను నియోజక వర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని రాష్ట్ర విద్యుత్ అటవీ పర్యావరణ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలో శనివారం జరిగిన పల్లెబాట కార్యక్రమంలో ఆయన బండకింద కమ్మపల్లె, పెద్దగొట్టిగల్లు, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గప్రజలకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందడం చాలా సంతోషంగా ఉందన్నారు. పర్యటనలో భాగంగా ప్రజలనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. పలుచోట్ల మహిళలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. బండకింద కమ్మపల్లె శ్రీనాధపురం కాలనీ,చల్లావారిపల్లెలో రూ.5లక్షల చొప్పున నిర్మించిన తాగునీటి శుద్ధి ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఫజులుపేటలో రూ.17.50లక్షలతో నిరి ్మంచిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఫజులుపేట పరిధిలో 50 కుటుంబాలు పైగా వైసీపీలో చేరాయి. వారికి వైసీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో జడ్ ్పసీఈఓ ప్రభాకరరెడ్డి,పులిచెర్ల మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డీశ్వరరెడ్డి,ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి,వైస్ ఎంపీపీలు విజయశేఖర్‌రెడ్డి, నూలురెడ్డెప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు హరినాదరెడ్డి, తహశీల్దారు అమరనాద్, ఎంపీడీఓ దేవేంద్రనాద్, సర్పంచిలు ఇబ్రహీంఖాన్, వేమూరి ప్రసాద్‌నాయుడు,నాయకులు సూర్యనారాయణరెడ్డి, వెంకట రమణ, ఉమాపతి, మునస్వామినాయుడు, తులసినాయుడు, పరంధామ నాయుడు, రాజేష్,రెడ్డి ప్రసాద్, ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.

## దివ్యంగా సేవ కేంద్రం 2వ వార్షికోత్సవంలో మేయర్



తిరుపతి కార్పొరేటర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : మహతి ఆడిటోరియంలో దివ్యంగా సేవ కేంద్రం 2వ వార్షికోత్సవంలో నగర పాలక సంస్థ మేయర్ డా.శిరీష పాల్గొన్నారు. శనివారం ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా దివ్యంగులగళంలో అన్నమాచార్య సంకీర్తన విభావరిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ పేదల ఉన్నతి కోసం పాటు పడుచున్న ఉయ్ సపోర్ట్ చారిట బుల్ సంస్థ చేస్తున్న సేవ ప్రత్యేక్షంగా తాను చూశానని దివ్యంగుల కళాకారుల అన్నమాచార్య సంగీత కచేరి, నృత్యాలు చేసి ప్రతిభ చాటారని వారికి తన తరుపున ఎప్పుడు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి సతీమణి ప్రసన్న, గరిమెళ్ళ బాలకృష్ణ, సంగీత కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, తహసున్నిస బేగం, సోమశేఖర్, కార్పొరేటర్ పరదేసి నరేంద్ర నాథ్, డాక్టర్ హరికృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, మునికృష్ణ, అభయా క్షేత్రం తస్లిమ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో డిఐజి తనిఖీలు

తిరుపతి (క్రైం), ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : వార్షిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయాన్ని అనంతపురం రేంజ్ డిఐజి రవి ప్రకాష్, ఎస్‌పి పరమేశ్వర్ రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. సర్వీస్ పరమైన సంక్షేమ విషయాల్లో జాప్యం జరగకుండా ఉండాలని సూచించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిస్టిక్ క్రైమ్ రికార్డు బ్యూరోలో తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. స్పెషల్ బ్రాంచ్ అంటే పోలీస్ శాఖకి కళ్ళు లాంటివని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు రాజకీయపరమైన అంశాలపై ముందస్తు సమాచారం సేకరించి శాంతిభద్రతలు పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పి వెంకట్రావు ఏవో కిషోర్ కుమార్, ఎస్బి డిఎస్పి సురేందర్ రెడ్డి, సిఐలు రామకృష్ణచారి, శ్రీనివాసులు చంద్రశేఖర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు



తిరుచానూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: తిరుచానూరు పంచాయితీ యోగిమల్లవరంలో వెలసిన అతి పురాతన శివాలయం శ్రీ కాబాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామికి 10 రోజులు పాటు జరిగే మహా కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా శనివారం ధ్వజ గణపతి పూజ ఘనంగా నిర్వహించారు. పుణ్యాహవచనం చేసి అష్టలక్ష్మి హోమం నిర్వహించి లక్ష్మీదేవి ఆరాధన చేశారు.లక్ష్మీదేవి అనుగ్రహం కోసం చేసిన ఈ హోమం ద్వారా అమ్మవారి అనుగ్రహంతో అష్ట ఐశ్వర్యాలు,ధనధాన్యాలకు కొరవ ఉండదని అర్చకులు మూర్తి గురుకుల్ స్వామి తెలిపారు.అమ్మవారు సిరిసంపదలు, ధాన్యం, సంతానం, వీరం, విజయాలు ప్రసాదించి కటాక్షిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కన్నుల పండువగా జరిగే ఈ మహాకుంభాభిషేక మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామి అమ్మవార్లను కోరుతున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో అర్చకులు,ఎంపిటిసిలు,వార్డు సభ్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదంతోనే లోకేష్ యువగళం పాదయాత్ర

తిరుపతి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: రాష్ట్రంలో గత నాలుగేళ్ళ వైసిపి పాలనతో, అరాచకాలతో ప్రజలు విసిగిపోయారని, అక్రమ రౌడీయిజం,బెదిరింపులతో ప్రజలు భయపడుతూన్నారని, వీటన్నిటినీ ఎదిరించి ప్రజలకు అండగా నిలబడటానికి టిడిపి యువనేత,ఎమ్మెల్సీ నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజలు ఆశీర్వాదం ఉందని టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ తెలిపారు. జిల్లాలో సాగుతున్న పాదయాత్రకు విశేష ఆదరణ చూసి వైసిపి శ్రేణులు భయపడుతున్నాయన్నారు. పాదయాత్రను అడ్డుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తూ, టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం. తప్పుడు కేసులు నమోదు చేయించడం జరుగుతోందన్నారు. టిడిపి నేతలపై పోలీసులు దాడులు చేసి వారిపైనే కేసులు పెట్టడం ఎంతవరకు మంచిదని, ఇదా ప్రజాస్వామ్యం అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు పూర్తి మద్దతు పలుకుతున్న పాదయాత్రను వైసిపి నాయకులు అడ్డుకుంటే ప్రజలే తరిమితరిమి కొడతారని హెచ్చరించారు. ఈ పరిస్థితి రాకుండా ప్రతిపక్షం చేపట్టిన పాదయాత్రకు పోలీసు రక్షణ కల్పించాలని టిడిపి నేతలు ఆర్‌సి మునికృష్ణ, సుబ్బుయాదవ్,చంద్రశేఖర్‌రెడ్డి, జగన్, ధర్మారెడ్డి సూచించారు.

## శివయ్యసేవలో జివిఎల్



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిథుల తాకిడి పెరుగుతుంది. రాహు కేతుదోష నివారణ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరా లయానికి శనివారం రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు కుటుంబ సభ్యులతో విచ్చేసారు.వారికి బిజెపి అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు సారధ్యంలో స్వాగతం ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో టెంపుల్ ఇన్స్ పెక్టర్ నాగభూషణం యాదవ్ వేదపండితులచే స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో బిజెపి నాయకులు గరికపాటి రమేష్ బాబు, కండ్రిగ ఉమ, డిల్లిబాబు, చిలకా రంగయ్య, చెంగల్‌రాయరెడ్డి,సొట్టా సుకుమార్, బాలిశెట్టి చంద్ర, కన్నా వెంకటేష్, వాసుయాదవ్,కోనేటి అయ్యప్ప, గోపాల్,వెంకటేశ్వర్లు,యువమోర్చా సభ్యులు హరి, చందూ రాయల్,శ్రీధర్,భరత్,రవి రాయల్, గిరినందసాయి.ఖాదర్, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

## కళాతపస్వి విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు పరామర్శ



నగరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: కళాతపస్వి సినీ పరిశ్రమకు చేసిన సేవలు వెలకట్టలేనిదని మంత్రి రోజా అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని విశ్వనాథ్ నివాసానికి వెళ్లిన ఆమె ఆయన చిత్రపటం వద్ద పుష్పార్చన చేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఏపీ ప్రభుత్వం తరపున సానుభూతిని తెలియజేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ కళాతపస్వి సినీ పరిశ్రమకు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. విశ్వనాథ్ లేరని ఊహించుకోవడమే కష్టంగ ఆఉందన్నారు. సినిమా ఇండస్ట్రీలో ఉంటూనే సినిమాలు అంటే ఏంటో తెలియని విధంగా చాలా నార్మల్ లైఫ్ లీడ్ చేశారంటే ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానన్నారు.

## ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై శాసనసభలో చట్టబద్ధత కల్పించాలి

**-ఏపిజిఇఏ జిల్లా అధ్యక్షుడు వైజెపి ప్రసాద్‌రెడ్డి**



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు, బకాయిల చెల్లింపుల గురించి శాసనసభలో చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైపిజె ప్రసాదరెడ్డి డిమాండ్ చేసారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, ఒప్పంద కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ భద్రతకు చట్టబద్ధతను కల్పించే దిశగా ఏపిజిఇఏ ప్రధాన లక్ష్యమన్నారు. శనివారం స్థానిక బాలాజీ కాలనీలో విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షర్ల, ఒప్పంద కార్మికుల సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు విషయాలను చర్చించినట్లు తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన జీతాల చెల్లింపు ఫైనాన్స్ కోడ్ 72వ నిబంధన మేరకు 1990 సంవత్సరంలో 223 జీవో ప్రకారం ఒకటో తారీఖునే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ పెన్షర్లకు 11వ పిఆర్సీ ద్వారా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల బకాయిలను ఏ నిర్ధిష్ట కాలపరిమితిలో చెల్లిస్తారో ప్రభుత్వం తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల జి.పిఎఫ్ ఖాతాల నిధులను ఉద్యోగుల అనుమతి లేకుండా డ్రా చేసిన సుమారు రూ.480 కోట్ల రుపాయాలను తిరిగి జమ చేస్తారో చెప్పాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన సరెండర్ లీవ్, ఎక్యాష్‌మెంట్ విధిగా ప్రతి సంవత్సరం ప్రభుత్వం లీవ్ అకౌంట్ ఆధారంగా నిర్ధిష్ట కాలపరిమితిని చెల్లించాలన్నారు. ఉద్యోగులకు చెందాల్సిన ఎల్.టి.సి. హోమ్ టౌన్ సదుపాయాలను నిర్ధిష్ట కాలపరిమితి అనుమతించాలన్నారు.

## ప్రమాదాలకు ముఖ్య కారణం మానవ తప్పిదమే!

**-డ్రైవర్లకు సహనం,ఏకాగ్రత అవసరం**
**-రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సభలో జడ్జి వీరరాజు**



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: రహదారుల మీద జరిగే ప్రమాదాలకు ప్రధాన కారణం మానవ తప్పిదమేనని 3వ అధనపు జిల్లా జడ్జి వై.వీర రాజు స్పష్టం చేశారు.శనివారం సాయంత్రం స్థానిక అలిపిరి ఆర్టీసీ డిపో నందు గత నెల 27 నుండి ఈనెల 2 వరకు జరిగిన రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సభ ఏపిఎస్ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి (డిపిటిఒ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్జి వీర రాజుతో పాటు జిల్లా రవాణా శాఖాధికారి కె.సీతారామి రెడ్డిలు హాజరయ్యారు.తాజాగా శ్రీకాహస్తి డిపోలో డ్రైవరుగా విధులు నిర్వహిస్తూ డ్యూటీలో ఉండగా గుండెపోటు వచ్చినా నొప్పిని భరిస్తూ బస్సును ఎడమ వైపు ఆపి,ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగనీయకుండా ఆ డ్రైవింగ్ సీటుపైనే ప్రాణాలు విడిచిన చిన్నికృష్ణకు నిమిషం పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జడ్జి వీర రాజు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నేరం-నేరస్తులు లేని సమాజం లేదనేది ఎంత నిజమో, ప్రమా దాలు లేని రోడ్లు,రహదారులు అంతే నిజమన్నారు. ఆర్టీసీలో గత రెండేళ్లుగా 31 మంది డ్రైవర్లు చనిపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ డిపోలలో డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తూ ప్రమాద రహిత డ్రైవింగ్ అందిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న 15 మంది ఆదర్శ డ్రైవర్లకు నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాన్ని జిల్లా రవాణా శాఖాధికారి సీతారామిరెడ్డి,జడ్జి వీర రాజులు అందచేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్‌రెడ్డి,బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డి.రామచంద్రనాయుడు,పర్సనల్ ఆఫీసర్ పార్థసారథి,తిరుపతి,తిరుమల,మంగళం డిపో మేనేజర్లు బాలాజి, విశ్వనాథ్,భాస్కర్,డిపిటిఒ కార్యాలయ పిఆర్ఓ బి.కృష్ణారెడ్డి,ఆర్టీసీలోని వివిధ అసోసియేషన్ నేతలు,గ్యారేజీ సిబ్బంది,పెద్ద సంఖ్యలో డ్రైవర్లు,కండక్టర్లు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న నంది సర్కిల్



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబౌ తుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లోపల పలు ఆకట్టుకునే అంశాలను పూర్తి చేయాలని పాలకులు సూచించారు.ఈ నేపథ్యంలో పట్టణ పొలిమేరల్లో విజయవాడవైపు నుంచి వచ్చే భక్తులను ఆకట్టుకునే రీతిలో అలాగే పట్టణానికి సూచికగా 'నందీ సర్కిల్'ను ఏర్పాటు చేసారు. సుమారు రూ.18లక్షలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నంది నిర్మాణం పూర్తి అయ్యింది. రంగులు అద్దే కార్యక్రమాల్లో కళాకారులు నిమగ్నమై ఉన్నారు. శ్రీకాళహస్తి అంటే నంది అనే సంకేతాలు ఇచ్చే విధంగా తీర్చి దిద్దారు.కాగా ఈ నందీ సర్కిల్ వద్ద లైటింగ్ఏర్పాటు చేయాలని పరిసర ప్రాంతాల్లోని శివభక్తులు కోరుతున్నారు. లేకుంటే చీకటిలో ప్రమాదాలు జరిగే ప్రమాదమందని చెబుతున్నారు.కాగా చెన్నై నుంచి వచ్చే భక్తులకు ఎంజిఎం కార్పొరేట్ ఆసుపత్రి వద్ద మరో సర్కిల్‌ను ఏర్పాటు చేసారు. ఇక్కడ భక్తకన్నప్ప నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. శివయ్యకు తన కన్నులను సమర్పించి మొదటి పూజలు అందుకున్న తిన్నడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి కన్నప్ప సర్కిల్ అని పేరు పెట్టారు. వీటి నిర్మాణం పూర్తి కావచ్చింది.